జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 20-06-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 50 పేజీలు: 4 వెల : రూ.7



# కాళింగ నేతల.. కినుక..!





*** అలక పాన్పు వెనుక అసలు కారణం అదేనా**
*** తొలి సమావేశానికి హాజరుకాని ఇచ్ఛాపురం, ఆమదాలవలస ఎమ్మెల్యేలు**
*** క్యాబినెట్లో స్థానం కల్పించకపోవడంతో గుర్రుగా ఉన్న సామాజిక వర్గం**
*** కీలక సమావేశానికి రాకపోవడంపై పెదవి విప్పని నేతలు**

**శ్రీకాకుళం, జూన్ 19 (వార్త):** అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి జిల్లాలోని అధికారులు అందరినీ ఒకే వేదిక వద్దకు తీసుకువచ్చి నిర్వహించిన కీలకమైన సమావేశానికి కాళింగ నేతలు డుమ్మా కొట్టారు. ఐదేళ్లు ప్రతిపక్షంలో ఆపసోపాల అనంతరం పార్టీకి అధికారం లోకి వచ్చిన వారు, ఈ తొలి సమావేశాన్ని గ్రాండ్ సక్సెస్ చేస్తారని భావించారంతా. కానీ ఏమైందో ఈ కీలకమైన సమావేశానికి ఇద్దరు కాళింగ సామాజిక వర్గ శాసనసభ్యులు డుమ్మా కొట్టారు. సామాజిక సమీకరణాలను సమన్వయం చేసుకుంటూ మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అంతా భావించగా అందులో వీరిద్దరి పేర్లు కనీసం పరిగణలోకి తీసుకోకపోవడంతో వారిద్దరూ కినుక వహించారని జిల్లా మొత్తం టాక్. శ్రీకాకుళం జిల్లాలో ఓటర్ల సంఖ్యలో ముందు వరసలో ఉండే ఈ సామాజిక వర్గానికి చంద్రబాబు క్యాబినెట్లో పరిగణలోకి తీసుకోకపోవడంతో జిల్లాలోని ఆ సామాజిక వర్గ పెద్దలంతా గుర్రుగా ఉన్నారు.

ఈ క్రమంలో జిల్లా నుంచి ఒకే కుటుంబానికి చెందిన, ఒకే ఊరికి చెందిన వెలమ సామాజిక వర్గమైన రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రి పదవి, అచ్చం నాయుడుకు రాష్ట్ర మంత్రి పదవి లభించాయి . దీంతో కాపు, కాళింగ సామాజిక వర్గాలు ఎంతో కొంత అలక పాన్పు ఎక్కాయి. తర్వాత స్థానంలో ఉన్న కాపుల నుంచి ఒకే ఒక్క అసెంబ్లీ స్థానం ఇవ్వడం అందులోనూ కొత్త ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు ఉండటం ఆ సామాజిక వర్గాన్ని సులువుగా తప్పించడానికి అవకాశం దొరికింది. అదే విషయానికొస్తే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కేవలం ఒకేసారి ఇచ్ఛాపురం నుంచి ఓడిపోయిన ఆ పార్టీ తరఫున ఈసారి మూడోసారి ఎమ్మెల్యేగా ఉన్న బెందాళం అశోక్ కు క్యాబినెట్ బెర్త్ తప్పక దక్కుతుందని అంతా భావించారు. కానీ అదీ జరగలేదు.

ఇంతలో తొలిసారిగా జిల్లాకు మంత్రులు వచ్చిన సందర్భంలో గానీ, జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఇచ్ఛాపురం.. ఆమదాలవలస శాసనసభ్యులు బెందాళం అశోక్, కూన రవికుమార్ పాల్గొనలేదు. ఈ సంఘటన జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలాన్ని సృష్టించింది. తొలి సమావేశానికి హాజరు కాకపోవడం పట్ల చాలా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరి సామాజిక వర్గానికి సరైన ప్రాధాన్యత పార్టీ కల్పించలేదని ... దానికి ఈ కింజరాపు కుటుంబం సభ్యులే ప్రధాన కారణం అని అంతా భావిస్తున్నారు . తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రోజుల్లోనే కూన రవికుమార్‌కు విప్ పదవిని తెదేపా కట్టబెట్టింది. ఈసారి కచ్చితంగా ఆయనకు క్యాబినెట్లో స్థానం ఉంటుందని అంతా ఆశించారు.

అదేవిధంగా వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టిన ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ బాబుకు ప్రమోషన్ ఉంటుందని భావించారు. అయితే, అశోక్ కు పదోన్నతి లభించకపోయినా ఆయన నుంచి పెద్దగా నిరసన వ్యక్తం కాదనే అభిప్రాయం కూడా పార్టీలో ఉంది. ఎందుకంటే ఆయన దాదాపు కింజరాపు కుటుంబ సభ్యుడే.. రామ్మోహన్ , అచ్చం నాయుడు గీచిన గీతను ఎట్టి పరిస్థితుల్లో కూడా ఆయన దాటరనే పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం అనంతరం ఇచ్ఛాపురం నియోజకవర్గానికి పది సార్లు ఎన్నికలు జరిగితే 9 సార్లు తెదేపా గెలవడంతో ఆ నియోజకవర్గానికి గౌరవం సుముచితమని అంతా విశ్లేషణ చేసుకున్నారు. అయితే ఎవరూ ఊహించని విధంగా వీరిద్దరికీ నిరాశ ఎదురయింది . ఈ వ్యవహారమే జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. అయినప్పటికీ ఎటువంటి ఫలితం సామాజిక వర్గానికి రాలేదు. ఈ నేపథ్యంలో ఇద్దరు మంత్రులు జిల్లా కేంద్రంలో అట్టహాసంగా ఏర్పాటు చేసిన సమావేశానికి వీరిద్దరి హాజరుపైనే అంతా దృష్టి పెట్టారు. అయితే మెజారిటీ వర్గాల ఊహించినట్టే అశోక్, రవికుమార్ గైర్హాజరయ్యారు. కారణాలు ఏమైనా కీలకమైన ఈ సమావేశానికి అధికారులకు ప్రజాప్రతినిధులకు మధ్య పరిచయ వేదికగా ఏర్పడిన ఈ సమావేశానికి ఇద్దరు యువ నాయకులు హాజరు కాకపోవడం జిల్లా తెలుగుదేశం పార్టీలో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఈ దూరం ఎంతవరకు పోతుందోనని పార్టీ అభిమానులు ఆవేదన చెందుతున్నారు.

మరోవైపు నుంచి తమ ప్రతాపాన్ని కింజరాపు కుటుంబానికి రుచి చూపిస్తామని కాళింగ సామాజిక వర్గ ప్రజలు కుతుకుతెలాడుతున్నారు. అచ్చం నాయుడు స్థానంలో ఎర్రంనాయుడు ఉండుంటే తమ సామాజిక వర్గానికి ఇలా అన్యాయం చేసేవారు కాదని అభిప్రాయపడుతున్నారు. తన స్వార్థం చూసుకున్నారే తప్ప పార్టీ భవిష్యత్తును, ఉనికిని అచ్చం నాయుడు ఆలోచించలేదని కాళింగ పెద్దలు బాహటంగా విమర్శిస్తున్నారు. ఈ సమావేశానికి కూన రవి హాజరు కాకపోవడంపై ఆయనకు మద్దతిస్తున్న కాళింగ పెద్దలంతా హర్షం వ్యక్తం చేశారు. అయితే వ్యక్తిగత పనుల మీద అమరావతిలో బిజీగా ఉండడంవల్ల ఈ సమావేశానికి ఆయన హాజరు కాలేదని మరికొందరు చెబుతున్నారు.

---

# దేవుని సంబరాల్లో..
# ఇదేం పాడుపని!

* తీరప్రాంత గ్రామాల్లో అశ్లీల నృత్యాలు
* అర్ధనగ్న ప్రదర్శనలు * యువతను కైపెక్కించేలా నృత్యాలు * గ్రామ దేవత ఉత్సవాల్లో రికార్డ్ డాన్స్‌ల జోరు
* పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు



**శ్రీకాకుళం/ సంతబొమ్మాళి, జూన్ 19 (వార్త):** సంతబొమ్మాళి మండలం నౌపడ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి మూలపేట పంచాయతీ కె.లింగూడు గ్రామంలో అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులోభాగంగా అదే రోజు రాత్రి అశ్లీల నృత్యాలు రికార్డింగ్ డాన్స్‌లు ఇష్టా రాజ్యంగా నిర్వర్తించడంతో కొంతమంది ఫోన్ ద్వారా చేసిన రికార్డులు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. అలాగే సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కొల్లిపాడు పంచాయతీ గంటపేట గ్రామంలో ఇటీవల అమ్మవారి ఉత్సవాల పేరిట రికార్డింగ్ డాన్సులు.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బయట జిల్లాల నుంచి మహిళలను రప్పించి వారితో స్టేజ్‌పై రికార్డ్ డాన్సుల పేరుతో ఆశ్లీలంగా నృత్యాలు చేయించారు. మండలంలో గత రెండు రోజులుగా అశ్లీల నృత్యాలు జరుగుతున్న పోలీసులు చోద్యం చూస్తున్నారని అయితే ఇవన్నీ కూడా పోలీసులకు తెలిసే జరుగుతున్నాయని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంతో భక్తితో నిర్వహించే దేవుని సంబరాల్లో ఇలాంటి పాడు పనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇటువంటి అశ్లీల రికార్డ్ డాన్స్‌లు సభ్య సమాజంలో యువకులని తప్పుదోవ పట్టిస్తున్నాయి. నృత్యం చేస్తున్న వారు అర్ధనగ్న ప్రదర్శన చేయడమే గాకుండా.. ఒంటిపైనే ఒక్కో నూలుగు పోగూ తీస్తు, యువతను కవ్వించే చర్యలు చేపడుతున్నారు. యువతను తప్పు దోవ పట్టించే అశ్లీల నృత్యాలు ప్రభుత్వ నిషేధించింది. పోలీసులు మామూళ్లు తీసుకొని ఇలాంటి రికార్డింగ్ డాన్స్‌లకు పర్మిషన్ ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా దీనిపై జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు

---

# మృత్యు శకటాలు

*** వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి* ఆగివున్న లారీని ఢీకొని ఇద్దరు * వాహనం ఢీకొని ఒకరు * ఆటో బోల్తా పడి ఎనిమిది మందికి గాయాలు**



**శ్రీకాకుళం క్రైం, జూన్ 19 (వార్త):** జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఆగివున్న లారీని మరో లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, రోడ్డు దాటుతుండగా ఓ వ్యక్తిని వాహనం ఢీకొని మరో వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. అలాగే ఆటో బోల్తా పడిన ఘటన ఎనిమిదికి గాయాలయ్యాయి. ఇలా బుధవారం రహదారులు రక్తమోడాయి. వివరాల్లోకి వెళితే.. జాతీయ రహదారిపై టెక్కలి మండలం విక్రమపురం గ్రామ సమీపంలో బుధవారం వేకువజామున అసోంకు చెందిన డ్రైవర్లు అసద్ అలీ(42), నూరుల్ ఇస్లామ్(35) పశ్చిమబెంగాల్ నుంచి లారీలో బియ్యం లోడును తూర్పుగోదావరి జిల్లా అనపర్తి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో విక్రమపురం వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న మరో లారీని బలంగా ఢీకొన్నారు. లారీ క్యాబిన్ నొక్కుకుపోవడంతో అందులో ఇరుక్కుని ఇద్దరూ మృతి చెందారు. నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగివుంటుందని, కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.లక్ష్మి తెలిపారు.

## ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు

**పలాస:** పాత జాతీయ రహదారి కిడ్నీ ఆసుపత్రి సమీపంలో బుధవారం మధ్యాహ్నం ఆటో బోల్తా పడిన ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. పలాస మండలం రంగోయి గ్రామం నుంచి పలాసలోని బ్యాంకు పనిపై వెలుగు గ్రామైక సంఘ అధ్యక్షురాలు బొంగు వనజాక్షి, గ్రామ సంఘ అధ్యక్షురాలు కుప్పిలి త్రివేణి, స్వయంశక్తి సంఘ గ్రూపు సభ్యులు బొంగి రమణమ్మ, గేదెల విజయలక్ష్మి, తెప్పల

... మిగతా 3లో

## కోటదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే జయకృష్ణ

**పాలకొండ, జూన్ 19 (వార్త):** పాలకొండ శాసనసభ్యుడు నిమ్మక జయకృష్ణ బుధవారం కోటదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మురళీకృష్ణ, ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మలు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి ఎమ్మెల్యేను సత్కరించారు. అమ్మవారి చిత్ర పటాన్ని ఎమ్మెల్యే జయకృష్ణకు బహుకరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, నాయకులు కర్నేన అప్పలనాయుడు, సుంకరి అనిల్‌దత్, అంపోలు శ్రీనివాసరావు, అడపా బాబ్జి తదితరులున్నారు.



# తోక జాడిస్తే కత్తిరిస్తా..!

### * సమష్టిగా పలాస మున్సిపాలిటీను అభివృద్ధి చేద్దాం * ఎమ్మెల్యే గౌతు శిరీష * పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ సమావేశం

**పలాస జూన్ 19(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని, ఎవరైనా మున్సిపాలిటీలో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే తోక కత్తిరిస్తానని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సుతిమెత్తగా కౌన్సిలర్లు, అధికారులకు హెచ్చరించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లుతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పాలకులు మున్సిపల్ చైర్మన్ అధికారం, స్వేచ్ఛను సైతం తీసుకున్నారని, అటువంటి తప్పును తాను చేయబోనన్నారు. స్వేచ్ఛగా ఎవరి పరిపాలన వారు చేసుకోవచ్చుని చెప్పారు. ఎవరైనా తోక జాడిస్తే కత్తిరించడం జరుగుతుందని హెచ్చరించారు. కౌన్సిలర్లు ప్రభుత్వానికి సహకరిస్తే మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నా వంతుగా నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. గత ప్రభుత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మూడు నెలల్లో మున్సిపాలిటీలో పారిశుధ్యం, తాగునీటి సమస్య పరిష్కారం చేస్తామని, అందుకు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. నాలుగేళ్లు నుంచి కెటి రోడ్డు విస్తరణ పనులు పూర్తి స్థాయిలో చేయలేక పోయారని, ప్రస్తుతం కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారంను తొలగించడం లేదన్నారు. తక్షణమే కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారంను



తొలగించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు ఎందుకు సరఫరా చేయలేక పోతున్నామని అధికారులను ప్రశ్నించారు. అందుకు ఏలా చేస్తే బాగుంటుంది? గత నాలుగేళ్లుగా మంచినీరు కోసం ఎంత నిధులు వెచ్చించారు? ప్రభుత్వం నుంచి ఎంత నిధులు మంజూరు అయ్యాయి? పారిశుధ్యం అధ్వానంగా ఉంది, ఎంత మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు? తదితర అంశాల పై అధికారులకు ప్రశ్నించగా దీని పై మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ బోర్లు, బావులు ఉన్నప్పటికీ అడుగంటి పోవడంతో ఆరు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేసేస్తున్నామని, రూ 700 కోట్లు మంచినీటి పథకం ద్వారా కేదారిపురం ట్యాంక్ నుంచి పైపులైన్ ఇస్తే మంచినీటి సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు బోర బుజ్జి, మీసాల సురేష్ బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, మున్సిపల్ అధికారులు కనకరాజు ఎఈ అవినాష్ అప్పలస్వామి అమర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు న్యాయం చేస్తాం

### *పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష * విత్తనాల పంపిణీ

**పలాస, జూన్ 19(వార్త):** ఖరీఫ్ సీజన్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు న్యాయం చేస్తామని, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. చినబడాం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆమె రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతీ రైతుకు ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు, ఎరువులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రైతులకు సేవలు అందించేందుకు అధికారులతో పాటు తాను కూడా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. నియోజకవర్గంలో 3163 క్వింటాలు విత్తనాలు వచ్చాయని, మందస మండలం స్లబ్ ప్లాన్ మండలంగా ఎంపిక కావడంతో గిరిజన రైతులకు 90 శాతం రాయితీ పై 560 క్వింటాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని గిరిజనులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పి విఠల్ రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరి, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, దువ్వాడ శ్రీకాంత్, సూరడ



మోహనరావు, పుచ్చ ఈశ్వరరావు, కుత్తుం లక్ష్మణ్ కుమార్, టి గంగారాం, వ్యవసాయ శాఖ ఏడిఎ ఎల్ మధుసూదనరావు, ఏఓలు పోలారావు, నాగరాజు, ఎఈఓ పాపారావు టిడిపి నాయకులు రైతులు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీవోడబ్ల్యూ అర్ధ శతాబ్ది ముగింపు సదస్సును విజయవంతం చేయండి




**పలాస, జూన్ 19(వార్త):** గత 50 ఏళ్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉద్యమ మార్గాన్ని ఎంచుకొని పోరాటంలో సాగుతున్న ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ ) అర్థ శతాబ్ది ముగింపు సదస్సును విజయవంతం చేయాలని పిఓడబ్ల్యూ శ్రీకాకుళం జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పొతనపల్లి కుసుమ సహాయ కార్యదర్శి కుతమ్ హేమక్క పిలుపునిచ్చారు. గురువారంఉదయం 10గంటలకు విశాఖపట్నం బీవీకే కాలేజీకి ఎదురుగా ఉన్న పౌర గ్రంథాలయంలో ప్రారంభం కాబోతున్న రాష్ట్ర మహిళా సదస్సుకు అధిక సంఖ్యలో మహిళలు తరలిరావాలని ఆమె కోరారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం మకనపల్లి గ్రామంలో పిఓడబ్ల్యూ కార్యకర్తలతో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళా ఉద్యమ నిర్మాణంలో పీవోడబ్ల్యూ 50 సంవత్సరాల ప్రయాణం... వర్తమానంలో మహిళా ఉద్యమ కర్తవ్యాలను నిర్దేశించుకునే లక్ష్యంగా ఈ రాష్ట్ర సదస్సు సాగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పీవోడబ్ల్యూ నాయకులు ఆర్.గంగాభవాని, ఎం .లక్ష్మి, కె.సంధ్య, ఎన్ విస్తు, తదితర మహిళా నేతలు వక్తలుగా పాల్గొంటున్నారని అన్నారు. ప్రముఖ యూట్యూబర్ ప్రముఖ స్వతంత్ర జర్నలిస్టు సి.వనజ సదస్సును ప్రారంభిస్తారని కుసుమ తెలిపారు. వివిధ మహిళా సంఘాల, ప్రజా సంఘాల నాయకుల సందేశాలు కూడా ఉంటాయని, అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పిఓడబ్ల్యూ అంతిమ లక్ష్యమైన స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించుకునేందుకు సాగే దీర్ఘకాలిక పోరాటాన్ని ముందుకు తీసుకుని వెళ్తూ మహిళలు నిత్యం ఎదుర్కొంటున్న తక్షణ పరిస్థితులపైన పీవోడబ్ల్యూ ఉద్యమిస్తూ సాగుతుందన్నారు.

పోరాడి సాధించు కున్న హక్కుల్ని పరిరక్షించుకుంటూ విశాల ఐక్య మహిళా ఉద్యమాన్ని నిర్మించుకునే కర్తవ్య నిర్వహణ కోసం ఈ అర్థ శతాబ్ది ముగింపు సదస్సు సాగుతుం దని కుసుమ వివరించారు. ఈ కార్యక్రమంలో పీవో డబ్ల్యూజిల్లా కమిటీ బర్ల జానికి, కామ్రేడ్ హేమక్కా, జానికమ్మ సావిత్రమ్మ, కార్యకర్తలు రాజమ్మ,, పుణ్యవతి, లక్ష్మమ్మ, తవటమ్మ, మహాలక్ష్మి, దమయంతి ఇందిర తదితరు పాల్గొని మాట్లాడారు.గ్రామంలో ప్రచారయాత్రను నిర్వహించారు.

## విద్యా కానుక కిట్లు పంపిణీ



**ఆమదాలవలస, జూన్19(వార్త):** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులందరికీ ఉచితంగా విద్యాకానుక వికెట్లు పంపిణీ చేయనున్నట్లు మండల టిడిపి సీనియర్ నాయకుడు తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కలివరం గ్రామంలో విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. టిడిపి హయాంలో విద్యకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత చదువులు చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన



**ఆమదాలవలస, జూన్19(వార్త):** మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సికిల్ సెల్ ఎనీమియాపై డాక్టర్ సిహెచ్ మాధురి అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక దూసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల స్వయంశక్తి సంఘ సభ్యులకు వెలుగు ఏ.పి.ఎం. పైడి కూర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ వ్యాధి లక్షణాలేంటంటే రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్ళు పసుపు రంగులోనికి మారడం, తీవ్రమైన కీళ్ళనొప్పులు, ఒంటి నొప్పులు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అలసట, తరచుగా వచ్చే అంటూ వ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలని చెప్పారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ చందర్రావు, స్థానిక వి.వో.ఏ. లు సునీత, సువర్ణ, పావనితో పాటు వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, చౌదామని ప్రభాకర్, స్వయం శక్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ



**సంతబొమ్మాళి, జూన్ 19 (వార్త):** మండల కేంద్రం సంతబొమ్మాళి ఆదర్శ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు బుధవారం పంపిణి చేశారు. సంతబొమ్మాళి పంచాయతీ అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠశాల విద్యాకమిటి చైర్మన్ ఆధ్వర్యంలోఈ పుస్తకాలు విద్యార్థులకు అందించారు.ఈ కార్యక్రమంలో కూచెట్టి కాంతారావు, చల్ల జగ్గారావు, అల్లు రమేష్ కుమార్,తంగి భాస్కరరావు, పప్పు కృష్ణరావు విద్యాకమిటి చైర్మన్ అల్లు భాస్కరరావు, హెచ్ ఎం అంగూరు రామారావు,ఉపాధ్యాయులు ఎల్వి రమణ కానూరు ఆనందరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ



**సంతబొమ్మాళి, జూన్ 19(వార్త):** నౌపడ, మేఘ వరం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు సర్పంచ్ ప్రతినిధులు, టీడీపీ నాయకులు, అధికారులు బుధవారం విత్తనాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం రూ.1050లకు విత్తనాలు బస్తా ప్రభుత్వం సబ్సిడీపై రూ.746కు పంపిణీ చేస్తుందని అధికారులు రైతులకు వివరించారు. ప్రస్తుతం పంచాయతీ పరిధిలో రైతులకు అందజేసేందుకు విత్తనాలు నిల్వ ఉన్నాయని రైతులు వినియోగించుకోవాలని ఆర్ బి కే అధికారి మృదుల, సుప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పిలక రవికుమార్ రెడ్డి, టీడీపీ యువ నాయకులు శాంతి స్వరూప్ రెడ్డి, మాజీ సర్పంచ్ కర్రి విష్ణుమూర్తి, సూరాడ దాసురాజు, పరపటి రాజు, వంక సోమేశ్వరావు, సూరాడ ధనరాజు, వాడరేవు కృష్ణ పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
జిల్లా వార్తలు



## ప్రభుత్వం ఆదుకోవాలి

**హిరమండలం, జూన్ 19 (వార్త):** విధి నిర్వహణలో మరణించిన కోరాడ-1 అంగనవాడి కేంద్రం సహాయకురాలిగా పనిచేస్తున్న దాసరి అప్పల నరసమ్మ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కెవి. హేమలత, వి. మధుబాల, పి. అనసూయ లు కోరారు. బుధవారం మృతురాలు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో సహాయకురాలు అప్పల నరసమ్మ మరణించడం బాధాకరమన్నారు. మృతురాలి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు. వీరితోపాటు సంఘ నాయకులు సిర్ల ప్రసాద్, జె. కాంతమ్మ, రజిని ఉన్నారు

## సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన




**మందస, జూన్ 19 (వార్త):** మందస మండలం సవర మధ్య గ్రామంలో ప్రపంచ సికిల్ సెల్ వ్యాది డే సందర్భంగా అవగహన మరియు ర్యాలీ కార్యక్రమం స్వయం సహాయక సంఘాల ద్వారా గిరిజన మహిళలకు అవగాహన కార్యక్రమం సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఏపీఎం గొడబ ప్రసాదరావు మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాది వక తరం నుండి మరొక తరానికి వ్యాపించే విధానం మరియు నివారణపై గిరిజన మహిళలకు అవగాహన కల్పించడం జరిగింది, సికిల్ సెల్ వ్యాధి అంటే రక్తం లో హిమోగ్లోబిన్ పై ప్రభావం చూపే వ్యాధి అని వివరించటం జరిగింది మరియు సికిల్ సెల్ వ్యాది లక్షణాలు అయిన రక్తకణాలు సంఖ్య తగ్గడం, కళ్ళు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన వొళ్ళు నొప్పులు మరియు కీళ్ళ నొప్పులు కల్గటం, శ్వాస తీసుకోవటం లో ఇబ్బంది, అలసట మొదలగు లక్షణాలు ఉంటాయి అని గిరిజన మహిళలకు తెలియజేసారు. ఈ అవేర్నెస్ ప్రోగ్రాం లో ఏపీఎం గొడబ ప్రసాదరావు, వీవోఏ గుర్రు లక్ష్మీకాంతం, డ్వాక్రా గిరిజన మహిళలు పాల్గొన్నారు

## రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావుకు సన్మానం



**సీతంపేట, జూన్19(వార్త):** గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు కొండగొర్రి సుబ్బారావు దోనుబాయి ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. యుటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, డ్వామాపీడి కిరణ్ కుమార్, సీతంపేట ఐటిడిఎ డిప్యూటీ డీఈవో పి.నారాయుడు, కొత్తూరు, సీతంపేట ఎంఈవోలు సీహెచ్ గోవింద రావు, అనందరావు, ప్రధానోపాధ్యాయులు కె.భాస్కరరావు, సుందరరావు లు, యుటీఎఫ్ నాయకులు దండు ప్రకాశరావు, మన్యం జిల్లా యుటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఆరిక భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.క్రిష్ణారావు, నాయకులు పి.క్రిష్ణారావు, పకీరు, రాము, బి.జయప్రకాష్, పి.నారాయణరావు, సింహాచలం పాల్గొని సుబ్బారావు దంపతులను సన్మానించారు.

### నిబంధనలకు విరుద్ధంగా

## వాహనాలు నడిపితే చర్యలు



**వీరఘట్టం, జూన్ 19(వార్త):** ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ. జి.కళాధర్ హెచ్చరించారు బుధవారం ఎం.రాజపురం జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీలను చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన పత్రాలు అన్ని తప్పనిసరిగా తమ వెంట ఉంచుకోవాలని ఆయన సూచించారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, కారును డ్రైవ్ చేసేటప్పుడు తప్పకుండా సీట్ బెల్ట్‌ను ధరించాలని ఆయన అన్నారు. అలాగే మితిమీరిన స్పీడుతో వాహనాలను నడిపినా, మద్యం తాగి డ్రైవ్ చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్ వయసు కలిగిన పిల్లలకు వాహనాలు ఇచ్చే యజమాని పైన, నడిపే వారి పైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కళాధర్ స్పష్టం చేశారు.

# సువ్వారి ఎవరితో సవారీ...

**పొందురు, జూన్19 (వార్త):** ఆమదాలవలస నియోజక వర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సుమారు 10000 ఓట్లు సాధించిన సువ్వారి గాంధీ భవిష్యత్ ఏ పార్టీతో కొనసాగుతుంది అనే చర్చ నియోజకవర్గంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. పొందూరు మండలంలో గత 15సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో, 5సంవత్సరాలు కొనసాగి ఆ తరువాత వైసీపీ తీర్థం పుచ్చుకొని 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక కార్యక్రమాలు, పోరాటాలు చేసి ఎంపీపీ పీఠం దక్కించుకొని పొందూరు మండల ప్రజలకు మరింత దగ్గరయ్యారు. అప్పటి నుంచి అధికారంలో వున్న తెలుగు దేశం పార్టీ పొందూరు మండలంలో సుమారు 400మంది పింఛన్లు తొలగించడంతో నేరుగా ప్రధాన న్యాయస్తానాన్ని ఆశ్రయించి ఒక్కొక్కరికి 50000 రూపాయలు అందేలా పోరాటం చేయడంతో ఒక్కసారిగా హర్షద్వానాలతో మారుమొగిపోయిది. ఆ ఉత్సహంలో ఆయన అభిమానులు భారీగా ర్యాలీ తీయడంతో నియోజకవర్గంలో తమ్మినేనికి సువ్వారికి మధ్య గ్యాప్ పెరగడం మొదలయింది. అంతకు ముందు 2014సార్వత్రిక ఎన్నికల్లో తమ్మినేనికి టికెట్ వద్దు వేరెవరికి ఇచ్చినా పర్వాలేదు లేదా నాకు టికెట్ ఇచ్చినా పర్వాలేదంటూ జగన్ మోహన్ రెడ్డితో నేరుగా చర్చలు జరపడంతో నీకు 2024లో అవకాశం ఇస్తాను ఈ ఎన్నికల్లో తమ్మినేనిని గెలిపించండి. మీ పొందూరు మండలం వరకు పూర్తి బాధ్యత మీదే అంటూ భరోసా తీసుకొని మీకు నీనున్నానంటూ



భరోసా ఇవ్వడంతో అందరూ కలసికట్టుగా పనిచేసి 2019ఎన్నికల్లో వైసీపీని గెలిపించారు. ఆ తరువాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీగా వేరొక మహిళా అభ్యర్థిని తమ్మినేని బలపరచడంతో మొదలైన రచ్చ రెండు వర్గాలుగా విడిపోయేలా దారి తీసింది. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మాకే టికెట్ వస్తుంది అంటూ సువ్వారి వర్గం ప్రచారం చేయడంతో తమ్మినేని తీవ్ర ప్రయత్నం చేయడంతో ఇరువురుని వైసీపీ అధిష్టానం పిలిచి సర్దిచెప్పడంతో గతంలో మాట ఇచ్చారు. టికెట్ ఇవ్వండి లేదంటే ఇండిపెండెంట్ గానైనా పోటీ చేస్తానంటూ చెప్పడంతో తమ్మినేనికే టికెట్ ఇచ్చారు. ఆ తరువాత క్రమంలో పార్టీకి రాజీనామా చేసి 2024సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా సువ్వారి పోటీ చేసారు. వైసీపీకి ఎదురు గాలి వీయడంతో తెలుగు దేశం పార్టీ గాలిలో వైసీపీ అభ్యర్థులు అందరూ కొట్టుకుపోవడంతో ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా ఎక్కడ ప్రభావితం చేయనప్పటికి రాష్ట్రంలో 6గురుకి మాత్రమే 10000ఓట్లు రావడం అందులో సువ్వారి ఒకరు కావడంతో సర్వత్రా చర్చ మొదలయ్యింది. సువ్వారి ఏ పార్టీ తీర్థం తీసుకుంటారో అంటూ చర్చ మొదలయ్యింది. వైసీపీలో కొందరు నాయకులు రాబోయే కాలంలో అధికార పార్టీతో పోరాడాలంటే సువ్వారి లాంటి వ్యక్తికి మరలా పార్టీ నియోజకవర్గ బాధ్యతలు అప్ప చెప్పాలి అంటూ వాదనలు వినిపిస్తున్నాయి. రెండు పార్టీలలో ఇద్దరు నాయకులు వున్నారు కనుక అధికారం కోసం తహతహలాడుతున్న జనసేన పార్టీ వైపు వెళతారని కొందరు వాదిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ తనను నమ్ముకున్న కార్యకర్తలకు అండగా నిలబడాలంటే ఏదో ఒక పార్టీ తీర్థం పుచ్చుకోవాల్సిన పరిస్థితి వుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. సువ్వారి ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేసిచూడాలి.



## ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు

**ఆమదాలవలస, జూన్ 19(వార్త):** కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పిసిసి రాష్ట్ర కార్యదర్శి సనుపల అన్నాజీరావు ఆధ్వర్యంలో బుధవారం ఆమదాలవలస పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆటో కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా అన్నాజీ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళు తున్న మహా నాయకుడిని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమ గేయంగా ముందుకు సాగుతున్నారని బావి భారత ప్రధానిగాను అన్నాజీరావు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నారాయణరావు బొత్స వెంకటరమణ దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మృత్యుశకటాలు

(మొదటిపేజి తరువాయి)

మోహినమ్మ, మచ్చ వరలక్ష్మి, వనజాక్షి, దివ్య, ఓ చంటి పాపతో ఆటోలో వస్తుండగా కిడ్నీ ఆసుపత్రి జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో వీరంతా గాయపడ్డారు. వీరిలో వనజాక్షి, రమణమ్మకు తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆటో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**బూర్జ:** మదనాపురం గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్టు ఎస్ఐ జీవీ ప్రసాద్ తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సోహన్‌గౌడ్ (32) ప్లాస్టిక్ డబ్బాలను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తన ద్విచక్ర వాహనంపై డబ్బాలు అమ్ముకుంటూ పాలకొండ వైపు వెళ్తుండగా.. మదనాపురం వద్ద తన వాహనాన్ని ఆపి దిగుతుండగా అదే మార్గంలో వస్తున్న మరో వాహనం అతి వేగం వచ్చి సోహన్‌గౌడ్‌ను బలంగా ఢీకొంది. దీంతో అతడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం జెమ్స్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## ఆగివున్న లారీని ఢీకొట్టి.. ఇద్దరికి గాయాలు

**పొందూరు:** మండల పరిధిలోని ఎరుకలపేట జంక్షన్ వద్ద గారపేట నుంచి పొందూరు వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనంపై రాపాక గ్రామానికి చెందిన లుకలాపు చక్రి (45), మీసాల కృష్ణ (47) వెళు తూ ఎరుకల పేట జంక్షన్ వద్ద పక్కన ఆగి వున్న లారీని వీరి వాహనం ఢీకొంది. వీరిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి, 108 వాహనంలో పొందూరు ఆసుపత్రికి తరలించారు.

## యాచకుడు మృతి

**శ్రీకాకుళం టౌన్:** అరసవల్లి ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద ఓ యాచకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. రూరల్ ఎస్ఐ ఇచ్చిన వివరాలు మేరకు కనిమెట్ట గ్రామానికి చెందిన రఘుపతి శ్రీరామ్మూర్తి (45) బోడెమ్మ కోవెల సమీపంలో భిక్షాటన చేస్తుండేవారు. అనారోగ్యం కారణంగా మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# టూరిస్టులకు ప్రత్యేక రైలు

### రీజనల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి పి సావర్కర్

**ఆమదాలవలస, జూన్19(వార్త):** భారత్ గౌరవ యాత్ర టూరిస్ట్ రైలును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఐఆర్‌సిటిసి రీజనల్ మేనేజర్ క్రాంతి పి సావర్కర్ అన్నారు. బుధవారం స్థానిక స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అయోధ్య నుంచికాశీ పుణ్యక్షేత్రాలు గురువాయూ టూరిస్ట్ ట్రైన్ బయలుదేరుతుందన్నారు. వచ్చే నెల 9న బయలుదేరి తిరిగిన 27న వస్తుందన్నారు. ఒక్కొక్కరికి 16 వేల 525 రూపాయలు ప్యాకేజీగా నిర్ణయించామని తెలిపారు. ఈ యాత్ర తొమ్మిది రాత్రులు, పది రోజులుగా ఉంటుందని వివరించారు. పూర్తి ఖర్చులు ఐఆర్సిటిసి భరిస్తుందని వివరించారు. అంతేకాకుండా స్పెషల్ ఎయిర్ ప్యాకేజ్ యాత్ర లెహె లడక్ ప్యాకేజ్ ఆరు రాత్రులు ఏడు రోజులు మొత్తానికి 57 660 అవుతుందని తెలిపారు. మెగాకాల్ థాయిలాండ్ 5 రాత్రులు ఆరు రోజులు నిమిత్తం రూ.57, 815 ఒక్కొక్కరికి ఖర్చవుతోందని వివరించారు. ఈ ప్రయాణ ఖర్చులు నిమిత్తం ఎకామిడేషన్, ఖర్చులు, బ్రేక్ ఫాస్ట్, డిన్నర్, మొత్తం ఖర్చులు ఐఆర్సిటిసి




భరిస్తుందని తెలిపారు. బయలుదేరి నుండి వచ్చిననంతవరకు ఐఆర్సిటిఏ బాధ్యత అని అన్నారు. ప్రతిటూరుకు ఒక గైడ్ ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఐ ఆర్ సి టి సి 8287932203 సంప్రదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో చీప్ కమర్షియల్ అధికారి తాప, సంఘమిత్ర రామిల్, స్టేషన్ మేనేజర్ మొదలవలస రవి, ఐఆర్సిటిసి సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక





## వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి గడువు పెంపు

**ఆమదాలవలస, జూన్ 19(వార్త):** తొగరాం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు ఈ నెల 30వ తేదీవరకు గడువును పొడిగించినట్టు ప్రిన్సిపల్ డా బీ పైడి వెంకటరావు ప్రకటనలో తెలిపారు. ఆచార్య యన్జీ రంగా విశ్వవిద్యాలయం ఆదేశానుసారం ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన అన్నారు. జూన్ 1 నుండి 20వ తేదీ వరకు కోర్సుల్లో చేరేందుకు అవకాశం కల్పించినట్టు ఇదివరకు ప్రకటనలో పేర్కొన్నప్పటికీ విశ్వవిద్యాలయం గడువు పెంచడం జరిగిందన్నారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2002 ఆగస్టు 31 నుండి 2009 ఆగస్టు 31 లోపు జన్మించిన వారు ఉండాలని ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు పదోతరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని చెప్పారు. విద్యార్థులు www.angrau. ac. in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందన్నారు. పదో తరగతి సప్లమెంటరీ విద్యార్థులకు ఈ గడువు పెంచినట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9705209418 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని ప్రిన్సిపల్ వెంకటరావు తెలిపారు.

# పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు

### జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు



**హిరమండలం, జూన్19 (వార్త):** జిల్లాలోని అన్ని పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి. వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలో హిరమండలం మేజర్ పంచాయితీ పరిధిలో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా చెత్త సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించి, వ్యక్తం చేశారు. అలాగే పాత హిరమండలం వద్ద జరుగుతున్న పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కింజరాపు అచ్చన్న నాయుడు ఆదేశాల మేరకు జిల్లాలు వారం రోజులు పాటు అన్ని పంచాయతీ పరిధిలో పారిశుధ్య వారోత్సవాలను నిర్వహించాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు పారిశుధ్య వారోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో మురికి కాలువల్లో పూడిక తీత చేపట్టడం, త్రాగునీరు సమస్య పరిష్కరించటం వంటి చర్యలు చేపడతామన్నారు. రక్షిత మంచినీటి పథకం సంబంధించిన ట్యాంకులు శుభ్రపరచటం, మరమ్మత్తులకు గురైన మంచినీటి బోర్లను మరమ్మత్తులు చేపట్టడం వంటివి ప్రధాన ఉద్దేశం అన్నారు. రానున్న వర్షాకాలం సీజన్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడతామన్నారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్యం మెరుగుకు పంచాయతీల్లో నిధులు ఉన్నాయని, వాటిని సద్వినియోగించుకోవాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. ఈయనతో పాటు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి వై. శ్రీరామచంద్రమూర్తి, జూనియర్ సహాయకులు అనకాపల్లి నర్సింగరావు, నాయకులు అందవరపు వెంకట సురేష్, ఎంజీఆర్ యువసేన అధ్యక్షుడు పోతురాజు శ్రీధర్, బాలకృష్ణ, చీపురు ఈశ్వర రావు, తదితరులు ఉన్నారు

# ఆఫ్‌షోర్ పనులు పూర్తి చేస్తాం

* వంశధార ఎడమ కాలువ ద్వారా శివారుకు సాగునీరు అందించాలి
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
* వంశధార కాలువ పనుల పరిశీలన

**పలాస, జూన్ 19 (వార్త):** ఖరీఫ్ సీజన్లో శివారు భూములకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వంశధార అధికారులకు ఆదేశించారు. పలాస మండలం మోదుగులపుట్టి వంశధార ప్రధాన కాలువను బుధవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన వంశధార కాలువలో పూడికతీత పనులు నేటి నుంచే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కాలువలో మేజర్ మరమ్మతులు ఉంటే తాత్కాలికంగా పనులు చేపట్టి ఈ ఏడాది శివారు భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆఫ్ షోర్ రిజర్వాయర్ పనులు ఎంత వరకు వచ్చాయి? ఎంత శాతం పనులు జరిగాయి? తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో ఆఫ్ షోర్ రిజర్వాయర్ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఖరీఫ్ సీజన్లో రైతుల కోసం విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటికే చాలా మండలాల్లో విత్తనాలు ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మత్స్యకారులకు కావాల్సిన శీతల గిడ్డంగులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మంచి అవకాశం వచ్చిందని, తప్పనిసరిగా సద్వినియోగం చేసుకుని జిల్లాను అభివృద్ధి బాట పట్టిస్తానన్నారు. కార్యక్రమంలో వంశధార ఈఈ శేఖర్, టిడిపి నాయకులు వజ్జ బాబూరావు లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు బి నాగరాజు దువ్వాడ శ్రీకాంత్ కుత్తుం లక్ష్మణ్ కుమార్, డొక్కరి శంకర్ జోగ మల్లి, వంశధార అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన జర్నలిజం..

# కొంక్యాన సొంతం

* ఘనంగా వేణుగోపాల్ జన్మదిన వేడుకలు
* వృద్ధాశ్రమంలో భోజన వితరణ, సర్వమత ప్రార్థనలు





**శ్రీకాకుళం, జూన్ 10 (వార్త):** విలువలతో కూడిన జర్నలిజం కొంక్యాన వేణుగోపాల్ సొంతమని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిఐపిఆర్ వో) కె. చెన్నకేశవరావు అన్నారు. ఏపిడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, జైజయం పత్రికా సంపాదకులు కొంక్యాన వేణుగోపాల్ జన్మదినం సందర్భంగా నగరంలోని పాత ఎంప్లాయిమెంట్ ఆఫీస్ వద్ద ఉన్న ఖ్యాతీఫౌండేషన్ వృద్ధ జనాశ్రమంలో వృద్ధులకు బుధవారం భోజన వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన చెన్నకేశవరావు మాట్లాడుతూ వృత్తిధర్మాన్ని నిర్వహించడంతో పాటు సమాజహిత కార్యక్రమాలు వేణుగోపాల్ చేపట్టడం అభినందనీయమన్నారు. జేసీఐ జోనల్ చైర్మన్ పాలిశెట్టి మధుబాబు మాట్లాడుతూ మూడు దశాబ్ధాలుగా పత్రికా రంగంలో విశిష్టమైన సేవలు అందించడంతో పాటు సామాజిక సేవా రంగంలో నిరంతరం ఉండే వ్యక్తిగా వేణుగోపాల్ గుర్తింపు పొందారన్నారు. జేసీఐ గ్రీన్సిటీ ప్రెసిడెంట్ వరలక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు మణిశర్మ, గ్రీన్సిటీ సభ్యురాలు తమ్మినేని ఉషారాణి మాట్లాడుతూ కళలు, క్రీడలు, మహిళల ఆర్ధిక స్వావలంబన కోసం విశిష్టమైన సేవలు కొంక్యాస వేణుగోపాల్ అందిస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా కొంక్యాస వేణుగోపాల్, సరోజ దంపతులు వృద్ధులకు ఆహార పదార్థాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్ట్ గవర్నర్ కొంక్యాస మురళీధర్, సంఘ సేవకులు పైడి గోపాలరావు, వాకర్స్ క్లబ్ కార్యదర్శి దేవీప్రసాద్, సీనియర్ పాత్రికేయులు గుహాసంద్, కొర్లాన కొండబాబు, సోషల్ వర్కర్ తేజ తదితరులు పాల్గొన్నారు.

### వనితా వాకర్స్ ఆధ్వర్యంలో...


సగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదాసంలో వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొంక్యాన వేణుగోపాల్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ గవర్నర్లు జి. ఇందిరాప్రసాద్, పాట్నూరు గోవింద గుప్త, ఎలక్ట గవర్నర్ కొంక్యాస మురళీధర్, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు బి.వి.రవిశంకర్, కార్యదర్శి దేవీప్రసాద్, మీడియా జేఏసీ కన్వీనర్ శాసపు జోగినాయుడు, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మీ, కార్యదర్శి వాసంతి, రాంబాయి తదితరులు వేణుగోపాల్ను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మచ్చలేని వ్యక్తిత్వంతో పాత్రికేయ రంగంలో కొనసాగిన వ్యక్తులు కొద్దిమందే ఉంటారని, అందులో వేణుగోపాల్ మొదటి వరుసలో ఉండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మోహన్, తవుడు, మల్లిబాబు, బొడ్డేపల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. సర్వమత ప్రార్థనలు...సత్కారాలు...

హిందూ, ముస్లిం, క్రైస్తవ మతపెద్దల ఆధ్వర్యంలో వేణుగోపాల్ జన్మదినం సందర్భంగా సాయిబులతోటలోని పత్రికా కార్యాలయం వద్ద ప్రార్థనలు చేశారు. వేద పండితులు కాండూరి గోవిందాచార్యులు, జామియా మసీదు ఇమామ్, జిల్లా ఖాజీ అబ్దుల్ వహాబ్, క్రైస్తవ మత పెద్ద గంజి ఎజ్రా ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. అనంతరం వీరు వేణుగోపాల్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు కమిటీ పూర్వపు సభ్యులు బహుదూర్ భాష, టిడిపి నగర మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ నిజాముద్దీన్, జిల్లా ముస్లిం మైనార్టీ నేత ఎం.డి. రఫీ, జర్నలిస్టులు సత్య, రహీమ్, విజయ్, రామకృష్ణ, ఆకుల కృష్ణ, మణి, వేణు, ఇయాజ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### ఆశ్రా ఆధ్వర్యంలో...

ఆశ్రా సంస్థ అధ్యక్షులు గంజి ఆర్ ఎజ్రా ఆధ్వర్యంలో నగరంలోని సంపతి వినాయక ఆలయ సమీపంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు ఎస్.జోగినాయుడు, జిషన్ముఖరావు, కొండబాబు, శంభుమహంతి రత్నకిశోర్, ఎస్. విజయకుమార్, బహదూర్ బాషా, ఆశ్రా జిల్లా కార్యదర్శి కె. పార్థసారథి, ఐటీఐ అధినేత ఎం. వెంకటేశ్, హమీద్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.









## ఆదిత్యుని సన్నిధిలో తండేల్ చిత్ర బృందం

**శ్రీకాకుళం, టౌన్ జూన్ 19 (వార్త):** పాకిస్తాన్‌లో చిక్కుకున్న జిల్లా జాలారుల కథను చందూ మొండేటి దర్శకత్వంలో తండేల్ సినిమాగా రూపొందిస్తున్నామని, ఈ చిత్రానికి సంబంధించిన హీరోహీరోయిన్లు అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి తెలిపారు. ఈ మేరకు వారు అరసవల్లి సూర్యనారాయణస్వామిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం స్థానిక బృందావనం కల్యాణ మండపంలో అభిమానులకు తనతో ఫొటోలు తీసుకునే అవకాశం నాగచైతన్య కల్పించారు. దర్శనానంతరం ఆలయ ట్రస్టు సభ్యులు మండవిల్లి రవి, తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుత్తు చిన్నారావులు ఆయన్ను సత్కరించారు.



### జిల్లా వార్తలు

## రక్త హీనతను నిర్మూలించాలి

**శ్రీకాకుళం, టౌన్ జూన్ 19 (వార్త):** అంతర్జాతీయ సికిల్ సెల్ (వ్యాధి) దినోత్సవం సందర్భంగా ఐ.టి.డి.ఎ. సీతంపేట పరిధిలో ఐ.టి.ఐ.. కళాశాలలో ఐ.టి.డి.ఎ. అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య విభాగం సంయుక్తంగా అవగాహన సదస్సుతోపాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సికిల్ సెల్ (వ్యాధి) రక్తహీనతను 2047 నాటికి నిర్మూలించడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో 0-40 ఏళ్ల మధ్య వయసున్న 7 కోట్ల మందికి అవగాహనా కల్పించామన్నారు. సార్వత్రిక నిర్ధారణ పరీక్షలు కౌన్సిలింగ్ నిర్వహించామని చెప్పారు. ఇందులో భాగంగా 2024 జనవరి నుండి ఇప్పటివరకు 1,00,024 గిరిజన ప్రాంతాల్లో 0-40 ఏళ్ల వయసు వరకు, బడి పిల్లలకు సికిల్ సెల్ (వ్యాధి) రక్తహీనత పరీక్షలు నిర్వహించగా, అందులో 195 పాజిటివ్, 4018 ట్రైట్ కేసులను నిర్ధారించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జ్ రఘురాం, సంబంధిత అధికారులు ఎస్.వి.గణేష్ ఐ.టి.డి.ఎ.,సీతంపేట, సోమేశ్వర రావు, తహసీల్దార్, సీతంపేట, గీతాంజలి, ఎం.పి.డి..ఓ , మంగవేణి, డా.తేజశ్రీ, డా. ప్రసన్న కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ కాళింగ సంక్షేమ సేవా సంఘం మీడియా కార్యదర్శిగా చౌదరి



**శ్రీకాకుళం, టౌన్ జూన్ 19 (వార్త):** ఆంధ్రప్రదేశ్ కాళింగ సంక్షేమ సేవా సంఘం మీడియా కార్యదర్శిగా చౌదరి లక్ష్మణరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ కాళింగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు సీపాన వెంకట రమణ తనను నియమిస్తూ నియామక పత్రం, గుర్తింపు కార్డు అందించారన్నారు. తాను శ్రీకాకుళం జిల్లా జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షునిగా, శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ మీడియా సెల్ కన్వీనర్‌గా పనిచేశానని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల అసోసియేషన్, శ్రీకాకుళం జర్నలిస్ట్ ఫోరమ్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శిగా, ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షునిగా, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్‌గా, జిల్లా ఉపాధ్యక్షునిగా పనిచేస్తున్నా నని చెప్పారు. ఆ అనుభవాన్ని గుర్తించి ప్రస్తుతం రాష్ట్ర మీడియా కార్యదర్శిగా తనను నియమించినట్లు తెలిపారు. ఈ నియామకం పట్ల తాను అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు.

## వినుత్నసంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు




**శ్రీకాకుళం, టౌన్ జూన్ 19 (వార్త):** శ్రీకాకుళం ఇందిరా విజ్ఞాన్ భవన్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం వినుత్నసంగా నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ జన్మదిన వేడుకల్లో సాధారణంగా కేక్‌ను కత్తిరించే కార్యక్రమానికి భిన్నంగా, పండ్లను కట్ చేసి కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, డాక్టర్ రామమోహనరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణారావు, శ్రీకాకుళం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.గోవింద మల్లిబాబు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే వి ఎల్ ఎస్ ఈశ్వరి, శ్రీకాకుళం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, జిపి నాయుడు ,దీర్ఘాసి వెంకట్రావు, ఎం. అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్



**శ్రీకాకుళం, టౌన్ జూన్ 19 (వార్త):** శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూర్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన ఎం.వినిషా బుధవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాని అందజేసారు. ఈ మేరకు ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి అసంఘిత కార్యక్రమాలు జరగకుండా ఉండేలా బాధ్యతలు నిర్వహించాలన్నారు.

# రాష్ట్ర విభజన హామీలకు కృషి చేయాలి





**శ్రీకాకుళం, టౌన్ జూన్ 19 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణా బైఫిర్కేషన్ చట్టం ఒక్క ఆర్డర్ కాపీ, అందులో ఏపీ రాష్ట్ర విభజన హామీలు అమల కోసం నిరంతరం కృషి చేయాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి ఆనాటి ప్రతుల కాపీ బుక్‌లెట్‌ను ఆంధ్రప్రదేశ్ టిడిపి ప్రధాన కార్యదర్శి ఎస్సీ సెల్ విభాగం సవలపురపు వెంకటరమణ మాదిగ అందజేశారు. విభజన హామీలు పూర్తిగా అమలు జరగనందున, మరో 10 సంవత్సరాలు కాలం పాటు అమలు జరిగేటట్లు చట్ట సవరణ చేయాలని కోరారు.

## ఎస్పీని కలిసిన నూతన ఎస్ఐలు



**శ్రీకాకుళం టౌన్ జూన్ 19 (వార్త):** ఇటీవలే విశాఖపట్నం రేంజ్ పరిధిలో పలువురు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ లకు రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లాలో ఆరుగురు అసిస్టెంట్ బ్ ఇన్‌స్పెక్టర్లకు బ్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించారు. అలాగే శ్రీకాకుళం జిల్లాకు మరో ముగ్గురికి రేంజ్ పరిధిలో ఎస్ఐలుగా కేటాయించారు. పదోన్నతులు పొంది శ్రీకాకుళం జిల్లాకు కేటాయించిన సబ్ బ్ ఇన్‌స్పెక్టర్లు పి.ఢిల్లీరావు, పి.వి.రమణ, కె.శివాజీ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్ రాధికను వారు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నూతన ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి అనేది ఉద్యోగులకు మరింత బాధ్యత పెంచుతుందని, విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ ఉన్నారు.

## అర్ధరాత్రి గాలివాన బీభత్సం

### - కూలిన చెట్లు.. తెగిన విద్యుత్ వైర్లు - ధ్వంసమైన వాహనాలు, దుకాణాలు

**శ్రీకాకుళం టౌన్ జూన్ 19 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో మంగళవారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల పాటు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. భారీ గాలులకు పెద్దపెద్ద చెట్లు కూలి పోయాయి. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో సమీపంలో ఉన్న దుకాణాలు ధ్వంసమయ్యాయి. ఇప్పటికే ఐదు రోజులుగా కరెంట్ కోతతో, ప్రజలు ఉక్కపోతకు గురవుతున్న తరుణంలో విరిగిన స్తంభాలు వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి మరింతగా ఇబ్బందులు పడుతున్నారు. ఇది ఇలా ఉండగా స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే అశోక్ బాబు 40 అడుగుల కటౌట్ విరిగిపోయింది. ముచ్చటగా మూడోసారి ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయపతాకం ఎగురవేసిన అశోక్ బాబుకు శుభా కాంక్షలు తెలుపుతూ భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందే ఇలా నేలకొరగడంతో అభిమానులు నిరాశ చెందారు.



## శంకరన్న జన్మదినాన అనాథలకు ఆపన్న హస్తం

**శ్రీకాకుళం టౌన్ జూన్ 19 (వార్త):** శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ నాయకుడు దాస్యం నాని ఆధ్వర్యంలో స్థానిక బెహరా మనోవికాస కేంద్రంలో బధిరులకు బుధవారం భోజన ఏర్పాట్లు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి అభిమానులు, బాధిరులకు తినిపించారు. అనంతరం నాని, అభిమానులతో కలసి వారికి భోజనాలను స్వయంగా వడ్డించారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413